సాక్షి
విజయనగరం

ఆదివారం । 17 । ఆగస్టు । 2025



బతుకు చక్రం కదలట్లేదు..!

మరో పది రోజుల్లో వినాయకచవితి పండగ రానుంది. ఈ క్రమంలో ఇప్పటికే కుమ్మరి వీధులన్నీ సాధారణంగా వినాయక విగ్రహాల తయారీతో హడావిడిగా ఉండాలి. - 8లో



కనకాంబరాలతో కనక వర్షం

పూల సాగులో కనకాంబరాలది ఓ ప్రత్యేకత. గ్రామీణ ప్రాంతాల్లో వాడంబారాలుగా పిలవబడే పూలు రైతులకు కనకవర్షం కురిపిస్తున్నాయి. - 8లో



న్యూస్‌రీల్

శ్రీకృష్ణాష్టమి పూజలు



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: శ్రీకృష్ణుని చల్లని దీవెనెలు ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందమయమైన జీవితాన్ని సాగించాలని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ధర్మపురిలో శనివారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాల నడుమ రాధాకృష్ణులకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు మజ్జి పుష్పాంజలి, సిరిసహస్ర, బద్దుకొండ ప్రదీప్ నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

మడ్డువలసకు నీటి తాకిడి



మడ్డువలస ప్రాజెక్టు నుంచి నాగావళి నదిలోకి విడిచిపెడుతున్న నీరు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టుకు నీటితాకిడి పెరిగింది. ప్రాజెక్టులో సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 7వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. 64.52 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని ఏఈ నితిన్ తెలిపారు. ప్రాజెక్టులోకి వచ్చిన 7 వేల క్యూసెక్కుల నీటిని రెండు గేట్లు ఎత్తి నాగావళి నదిలోకి విడిచిపెడుతున్నామన్నారు.

తీరంలో అలజడి

- నిలిచిన చేపల వేట



ముక్కాంలో మత్స్యకారులు ఒడ్డుకు చేర్చిన పడవలు

భోగాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. అధికారుల హెచ్చరికలతో భోగాపురం మండలంలోని సముద్రతీర ప్రాంతాల్లో నాలుగు రోజులుగా చేపలవేటను మత్స్యకారులు నిలిపివేశారు. ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం తదితర సముద్రతీర ప్రాంతాల మత్స్యకారులు తమ పడవలు, వలలను భద్రపరిచి విశ్రాంతి తీసుకుంటున్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం



అసోసియేషన్ జెండా ఆవిష్కరణలో సంఘ నాయకులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం స్థానిక పెన్షన్ సంఘం కార్యాలయంలో శనివారం ఘనంగా జరిగింది. తొలుత అసోసియేషన్ జండాను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్రపండ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూపీ హైకోర్టు అడిషనల్ రిజిస్ట్రార్ విద్యాసాగర్, ప్రత్యేక అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి ఎల్.వి. యుగంధర్, రాష్ట్ర కోశాధికారి సొంటి కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బి.బాలభాస్కర్, జిల్లా కోశాధికారి వై.శంకరరావు, ఆదినారాయణ, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



నగదు పురస్కారంతో రాజాం మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు

కృష్ణం వందే జగద్గురుమ్

శ్రీకృష్ణజన్మాష్టమి వేళ... ప్రతిఊరు ద్వారకను తలపించింది. ప్రతి భక్తుడి మది ఓ మందిరంగా మారింది. శనివారం ఉదయం నుంచి ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. శ్రీకృష్ణుడి సేవలో తరించారు. ప్రత్యేక పూజలు చేశారు. చిన్నాపెద్దా తేడాలేకుండా ఉట్టిసంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులుబ అలరించారు. ప్రబోధసేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురజాడ కళాభారతి ఆడిటోరియంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సృష్టి అంతటికీ దేవాదిదేవుడు శ్రీకృష్ణుడన్నారు. భగవద్గీత జ్ఞానాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకుని ఆచరణ జ్ఞానంగా చేయాలన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు వి.శంకరరావు, సంఘ సేవకులు కేసలి అప్పారావు, ముద్దాడ మధు, గదుల సత్యలత, తదితరులు పాల్గొన్నారు. - విజయనగరం టౌన్

- ఫొటోలు సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



గురజాడ కళాభారతి ఆడిటోరియంలో శ్రీకృష్ణుడు విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



సంతకవిటి: కృష్ణంవలసలోని వేణుగోపాలుని ఆలయ ఆవరణలో ఉట్టికొట్టే సంబరం



విజయనగరం జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారం గొల్లవీధిలో ఉట్టికొట్టే సంబరంలో యువత

అందని ఆర్థిక ప్రోత్సాహకం!





- ఆవేదనలో ఆరోగ్యశ్రీ వైద్యులు, సిబ్బంది
- ఏడాదిన్నరగా బకాయిలు
- ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో 100 మంది సిబ్బందికి అందని వైనం
- రూ.33 లక్షల వరకు బకాయిలు
- నిధులు కాజేసేందుకు ఓ ఉద్యోగి ప్రయత్నాలు!

విజయనగరంఫోర్ట్:

ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) పథకం కింద రోగి శస్త్రచికిత్సలో పాల్గొనే వైద్యులు, సిబ్బందికి ఆర్థిక ప్రోత్సాహం అందని ద్రాక్షగా మారింది. ఏడాదిన్నరగా ప్రోత్సాహకం అందకపోవడంతో సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు ఇన్సెంటివ్‌ను అందజేయడంలో అలసత్వం వహిస్తున్నాయని తెలిసింది. కొన్నిచోట్ల ప్రోత్సాహకం నిధులు కాజేసేందుకు ఉద్యోగులు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం రోగులకు చికిత్స అందించినందుకు సంబంధిత ఆస్పత్రి సిబ్బందికి ఆరోగ్యశ్రీ ట్రస్టు ఆర్థిక ప్రోత్సాహకం అందజేస్తుంది. దీనిని ఆస్పత్రి అధికారులు శస్త్రచికిత్సలో పాల్గొన్న సిబ్బందికి అందజేయాలి. ఎస్.కోట ప్రాంతీయ ఆస్పత్రి వైద్య సిబ్బందికి ఆస్పత్రి అధికారులు ఏడాదిన్నర కాలంగా ప్రోత్సాహకం చెల్లించలేదని కొందరు సిబ్బంది బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

రూ.33లక్షల బకాయిలు

ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో 100 మంది వరకు వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో 20 మంది వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్, ల్యాబ్‌టెక్నీషియన్స్, క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ 80 మంది వరకు ఉంటారు. వీరికి గత ఏడాదిన్నర కాలంగా ఇన్సెంటివ్స్‌ను ఆస్పత్రి వైద్యాధికారులు అందించలేదని సమాచారం. అధికారులను సిబ్బంది అడిగినప్పటికీ ఎటువంటి స్పందన లేదని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఆస్పత్రి సిబ్బందికి రూ.33 లక్షలు వరకు ఇన్సెంటివ్స్ రావాల్సి ఉందని చెబుతున్నారు.

ప్రోత్సాహకం చెల్లింపులు ఇలా..

ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స, శస్త్రచికిత్స చేస్తే ఆ వ్యాధిని బట్టి ప్యాకేజీ అందిస్తారు. ఇందులో రోగి సంక్షేమానికి 45 శాతం, ఇన్సెంటివ్స్ 35 శాతం, రివాల్వింగ్ ఫండ్ కింద 20 శాతం చెల్లిస్తారు. ఇన్సెంటివ్ 35 శాతంలో 70 శాతం శస్త్రచికిత్సలో పాల్గొన్న సిబ్బందికి అందించాలి. అదేవిధంగా వైద్య పరీక్షలు చేసే సిబ్బందికి 10 శాతం, నర్సింగ్ సిబ్బందికి 15 శాతం, 5 శాతం క్లాస్ ఫోర్ ఉద్యోగులకు అందించాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్య సిబ్బందికి ఎప్పటికప్పుడు ఆర్థిక ప్రోత్సాహకం అందేది. ఇప్పుడు ఏడాదిన్నరగా ఇన్సెంటివ్స్ అందకపోవడంపై సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్స్‌ను కాజేసేందుకు ఓ ఉద్యోగి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. గతంలో కూడా సదరు ఉద్యోగి అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

వైద్య సిబ్బందికి ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్స్ అందించడంలో ఎందుకు జాప్యం జరిగిందో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఆర్థిక ప్రోత్సాహకం అందేలా చూస్తాం.

– డాక్టర్ పద్మశ్రీరాణి, డీసీహెచ్ఎస్

బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగితే చర్యలు తప్పవు

- ఎస్పీ వకుల్ జిందల్
- ఇప్పటికే 13,260 కేసుల నమోదు
- మందుబాబులకు పోలీసుల కౌన్సెలింగ్



విజయనగరం క్రైమ్: జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజా శాంతికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ శనివారం హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్స్ చేపట్టామన్నారు. ఇప్పటివరకు 13,260 కేసులు నమోదు చేశామన్నారు. దాడుల్లో పట్టుబడిన మైనర్లైన మందుబాబులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. రహదారి భద్రత నియమాలు ఉల్లంఘించిన వారి నుంచి ఈ-చలానాలను విధిస్తున్నట్టు వెల్లడించారు.

ఏకగ్రీవంగా పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక



బాధ్యతలు తీసుకుంటున్న సంఘ నూతన కమిటీ

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ (ఏపీపీఆర్ఎంఈఏ) జిల్లా శాఖ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయనగరం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో శనివారం జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ప్రకటించారు. సంఘ అధ్యక్షుడిగా సీహెచ్ మురళి, ప్రధాన కార్యదర్శిగా పి.ఎం.రవి కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.వి.నాగభూషణరావు, ఉపాధ్యక్షుడిగా టి.ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా వి.రాంబాబు, జాయింట్ సెక్రటరీగా ఎల్.వి.ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.రాజ్ కుమార్, ఎం.నారాయణరావు, డి.లత, డీహెచ్‌వీఆర్ ప్రభాకర్, బి.లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్.అర్జునరావు, వి.ఎ.వర్మ, ఎ.రమణమూర్తి, కె.వి.శ్రీనివాసరావు, జేసీసీ మెంబర్‌గా బి.వి.గోవిందరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా విజయనగరం జిల్లా ఏపీఎన్‌జీజీఓ అధ్యక్షుడు టి.శ్రీధర్‌బాబు, సహాయ ఎన్నికల అధికారులుగా పట్టణ ఏపీఎన్‌జీఓ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.గోపాలకృష్ణ, ఎన్నికల పరిశీలకులుగా విశాఖ జిల్లా సంఘం అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీజీఓ జాయింట్ సెక్రటరీ ఎస్ఎంకేజీ ప్రసాద్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి.వి.రమేష్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బండి శ్రీనివాస్ హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు గంటా వెంకటరావు, ఆర్.వి.రమణమూర్తి, ఏపీఎన్‌జీజీఓ జిల్లా కార్యదర్శి ఎ.సురేష్, జిల్లా, తాలూకా యూనిట్ల సభ్యులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ 6వ వార్షికోత్సవం



సంఘ పతాకావిష్కరణలో నాయకులు

విజయనగరం అర్బన్:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) 6వ వార్షికోత్సవం జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘ పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ ఆధ్వర్యంలో ఏపీజీఈఏ రాష్ట్ర నాయకుడు, డిప్యూటీ డైరెక్టర్ అండ్ విశాఖపట్నం రీజనల్ డైరెక్టర్ (మెడికల్) శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎల్.వి.యుగంధర్, జిల్లా కార్యదర్శి బి.బాలభాస్కరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాసరావు, కోశాధికారి వై.శంకరరావు, ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి జి.లక్ష్మీనాయుడు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు చింతల వెంకట సతీష్, బియ్యాల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రంభ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిని మన్యం జిల్లాలో కలపాలి



మాట్లాడుతున్న వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు

బొబ్బిలి: ప్రభుత్వం నియోజకవర్గాలను పునర్విభజనకు సన్నాహాలు చేస్తున్న క్రమంలో బొబ్బిలి నియోజకవర్గాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేయాలని ఐక్యవేదిక నాయకులు కోరారు. బొబ్బిలిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ మన్యం జిల్లాకు బొబ్బిలి చేరువగా ఉందన్నారు. ఆ జిల్లాలో కలపడం వల్ల ఆర్థికంగా, భౌగోళికంగా ప్రయోజనాలు చేకూరుతాయని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు మరిశర్ల రామారావు నాయుడు, మువ్వల శ్రీనివాసరావు, ఒమ్మి రమణ, కోట అప్పన్న, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

హామీల జోరు.. అమలులో బేజారు

- టీడీపీది అబద్ధాల పాలన
- ఏడాదిన్నరగా ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు
- కనిపించని అభివృద్ధి, సంక్షేమం
- పథకాల అమలులో కనిపించని చిత్తశుద్ధి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి మంత్రులు, నాయకులు హామీలు ఇవ్వడంలో జోరుగా, హుషారుగా ఉంటారని, వాటిని అమలు చేయకుండా ప్రజలను బేజారు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఏపీపీ సభ్యులు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

- జీఓ 3ను పునరుద్ధరిస్తామని, గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా మార్చుతామని, ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ, 5వ షెడ్యూల్డ్, 1/70 కచ్చితంగా అమలు చేస్తామని, కొఠియా గ్రామాలకు పరిష్కారం చూపుతామని, కుడుమూరు భూవివాదం పరిష్కారం, డోలీ కష్టాలు లేకుండా చూస్తామని చంద్రబాబునాయుడు, లోకేష్, సంధ్యారాణి ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇప్పటివరకు వాటి పరిష్కారం ఊసేలేదు. దీనిపై గిరిజనులు ప్రశ్నిస్తున్నా స్పందన లేదు. ఇది గిరిజనులను మోసం చేయడం కాదా?. అబద్ధాలతో ఎన్నాళ్లు పాలిస్తారని రాజన్నదొర నిలదీశారు.

అబద్ధాలు చెప్పడంతో ఆరితేరిన మంత్రి...

మంత్రి సంధ్యారాణి ప్రజాదర్బార్, పత్రికా సమావేశాలు, స్వాతంత్ర్యదినోత్సవ వేదిక, చివరికి చట్టసభలలోనైనా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. సాలూరు శ్యామలాంబ పండగ కోసం రూ.2 కోట్ల అప్పుడబ్బులతో చేపట్టాల్సిన పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపినప్పటికీ, కౌన్సిల్ ఆమోదం తెలపలేదని ప్రజలు, పత్రికాసమావేశాల్లో మంత్రి సంధ్యారాణి అబద్ధాలు చెప్పిన విషయాన్ని గుర్తుచేసారు. మహిళల ఆత్మగౌరవం కోసం సాలూరులో మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.20లక్షల నుంచి రూ.30లక్షల వరకు నిధులు తీసుకువస్తానని చెప్పిన మంత్రి ఏడాది గడిచినా పట్టించుకోలేదని, ఆ పనులు జరగలేదని, మరి మహిళల ఆత్మగౌరవ నినాదం ఏమైందని రాజన్నదొర ప్రశ్నించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకంపై మంత్రి పెట్టిన తొలి సంతకం నేటికీ కార్యరూపం దాల్చలేదని ఎద్దేవా చేశారు.

- 2014–19 మధ్య టీడీపీ హయాంలో సంధ్యారాణి ఎమ్మెల్సీగా ఉండగా తను ఎమ్మెల్యేగా ఉన్నానని, 2015లో నాటి కలెక్టర్ ఎం.ఎం.నాయక్ సాలూరు నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులకు ఉపాధిహామీ కింద సుమారు 100 కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. తరువాత కలెక్టర్‌గా వచ్చిన వివేక్‌యాదవ్ తాగునీరు, రోడ్ల పనుల కోసం రూ.4.50 కోట్లు మంజూరు చేస్తే ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి ఆ నిధులు రాకుండా అడ్డుకున్నారని రాజన్నదొర విమర్శించారు.
- సాలూరులో వందపడకల ఆస్పత్రికి వైఎస్సార్ సీపీ అన్నిరకాల అనుమతులు తీసుకొచ్చి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువలో నీరేదీ?



ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు సమయం మించిపోతోంది. వరి నారు ముదిరిపోతోంది. ఇప్పటికీ గుర్ల మండలంలోని తోటపల్లి కాలువలో సాగునీరు ప్రవహించని పరిస్థితి. గొలగాం, తాటిపూడి, రాగోలు, వల్లాపురం, సదానందపురం గ్రామాల్లో కాలువ పరిధిలో నేటికీ వరి ఉభాలు జరగలేదు. గత ప్రభుత్వ హయాంలో సకాలంలో కాలువకు నీరు వచ్చేదని, ఇప్పుడు వర్షాలు కురుస్తున్నా కాలువ ఎండిపోయి కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో జూలై చివరికి వరి ఉభాలు వేసేవారమని, ఇప్పుడు ఆగస్టు చివరిలోనైనా దమ్ములు అవుతాయన్న నమ్మకం లేదని వాపోతున్నారు. కూటమి నేతలు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారే తప్ప తోటపల్లి కాలువకు నీరు వచ్చే మార్గం చూపడంలేదని ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కాలువకు నీరు వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

– గుర్ల

రాజాం మండల సమాఖ్యకు నగదు పారితోషికం

రాజాం: ఎన్ఆర్ఎల్ఎమ్ కేంద్ర ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డుకు రాజాం మండల మహిళా సమాఖ్య ఎంపికైన విషయం తెలిసిందే. స్వాతంత్ర్య దినోత్సవం రోజు రూ.లక్ష నగదు బహుమతిని న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ల చేతుల మీదుగా అందుకున్నట్టు సమాఖ్య అధ్యక్షులు రౌతు వెంకటమ్మ, కార్యదర్శి కొయ్యాన పార్వతి, ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. వీరిని ఏపీ సెర్ప్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ వి.కరుణ, సెర్ప్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసపాణి, ఏపీడీ కె.సావిత్రిలు శనివారం అభినందించారు.

నాగావళి పరవళ్లు



నాగావళి పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నదిలో నీటి ప్రవాహం పెరిగింది. సంతకవిటి మండలంలోని రంగారాయపురం సమీపంలోం నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట వద్ద వరదనీరు పరవళ్లుతొక్కుతోంది. నీటి ప్రవాహాన్ని చూసేందుకు పరిసరగ్రామాల ప్రజలు తరలివస్తున్నారు. – సంతకవిటి

క్లుప్తంగా

హైకోర్టు జడ్జి ఇంట సందడి


హైకోర్టు జడ్జిని కలిసి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరఘట్టం: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి గేదెల తుహిన్‌కుమార్ ఇంట వద్ద శనివారం సందడి నెలకొంది. ఆయన హైకోర్టు జడ్జిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి ఆయన స్వగ్రామమైన వీరఘట్టం మండల కత్తులకవిటి గ్రామానికి వచ్చారు. దీంతో ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపేందుకు స్థానిక నేతలు, అధికారులు క్యూ కట్టారు. హైకోర్టు జడ్జిగా ఈ ప్రాంతానికి చెందిన మీరు ఉండడం మాకు ఎంతో గర్వకారణంగా ఉందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. జడ్జి తుహిన్‌కుమార్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే వీరఘట్టం, పాలకొండ, రేగిడి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సూర్యప్రకాశరావు, డి.వెంకటరమణనాయుడు, కర్రి గోవిందరావు, పాట్నూరు లక్ష్మణరావు తదితరులు కలిశారు. వీరఘట్టం తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు తదితరులు జడ్జిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసుల అదుపులో పొట్టేళ్ల పందెంరాయుళ్లు


పోలీసుల అదుపులో పందెంరాయుళ్లు

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిబధ్ర గ్రామ శివారులో పొట్టేళ్ల పందెం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ పి.రమేష్ నాయుడు శనివారం తెలిపారు. ఉల్లిబధ్ర గ్రామ శివారులో పొట్టేళ్ల పందెం నిర్వహిస్తున్న ప్రదేశంలో దాడులు చేసి వీరిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. రెండు పొట్టేళ్లను, రూ.1680 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడిన ఆరుగురిపై కేసు నమోదు చేసి పార్వతీపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు.

అక్రమంగా పశువుల తరలింపు


అంతర్రాష్ట్ర రహదారిపై పశువుల అక్రమ రవాణా

కొమరాడ: ఒడిశా నుంచి పార్వతీపురం సంతకు కొమరాడ మీదుగా జాతీయ రహదారిపై మూగజీవాల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతుంది. బొలెరా వంటి వాహనాల్లో వందల సంఖ్యలో పశువులను అక్రమంగా తరలిం చేస్తున్నారు. వీటి రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం ఏమీ చూడనట్టు వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. వీటిని కబేళాలకు తరలిస్తున్నట్టు అధికార యంత్రాంగానికి తెలిసినా ఏమీ పట్టనట్టు వ్యవహరించడంపై దుమారం రేగుతోంది. అంతర్రాష్ట్ర ప్రధాన రహదారిపై వందలాది పశువులను తరలిస్తూ అక్రమ సంపాదనపై అక్రమార్కులు గురి పెట్టినా నిఘా వర్గాలకు ఏమీ పట్టడం లేదు. మరోవైపు వందలాది కిలోమీటర్ల పొడవునా వీటిని నడిపిస్తూ కూడా కబేళాలకు తరలిస్తున్నా ఇటు పోలీసులకుగాని, అటు జంతు సంక్షేమ సంఘాలకు అనుమానం కలగకపోవడం విశేషం. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మొద్దు నిద్రను వీడి మూగజీవాల పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

నూతన బార్ పాలసీ విడుదల

విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్లు 275, 276 ప్రకారం 2025–2028 సంవత్సరాలకు సంబంధించి నూతన బార్ పాలసీలను విడుదల చేసినట్టు జిల్లా మద్యనిషేధ, అబ్కారీ శాఖ అధికారి బి.శ్రీనాథుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీ, నగర పంచాయతీలలో గల 28 2బి బార్స్ నోటిఫై చేశామన్నారు. వీటిలో మూడు టూబీ బార్స్ కల్లు గీత కులాలకు కేటాయించామన్నారు. ఈ వేలం ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అదే విధంగా పార్వతీపురం మన్యం జిల్లాలో మున్సిపాలిటీ, నగర పంచాయతీలో ఎనిమిది 2బి బార్స్‌ను నోటిఫై చేశామన్నారు. వాటిలో రెండు 2బి బార్స్ కల్లుగీత కులాలకు కేటాయించామన్నారు. ఆసక్తి గల వారు వారి పరిధిలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌లలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 9440902360, 9440902362 (విజయనగరం), 8348523855, 9398630486 (పార్వతీపురం మన్యం) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

వృత్తి వదల్లేరు.. బతుకు చక్రం కదలట్లేదు..!

- వినాయక విగ్రహాలకు డిమాండ్ తగ్గడంతో కుమ్మరుల్లో ఆందోళన
- బతుకు భారమైందంటూ ఆవేదన
- ఆదుకోని కూటమి ప్రభుత్వం


వినాయక విగ్రహాల తయారీలో వృత్తిదారులు

సాలూరు: మరో పది రోజుల్లో వినాయకచవితి పండగ రానుంది. ఈ క్రమంలో ఇప్పటికే కుమ్మరి వీధులన్నీ సాధారణంగా వినాయక విగ్రహాల తయారీతో హడావిడిగా ఉండాలి. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి కుమ్మరి వీధుల్లో కనిపించడం లేదు. రథయాత్ర తరువాత ప్రారంభించే ఈ విగ్రహాల తయారీకి రెండు నెలల ముందు నుంచే సాలూరు, ఒడిశా పరిసర ప్రాంతాల నుంచి వినాయక కమిటీ నిర్వాహకులు వచ్చి భారీ పరిమాణంలో, వివిధ ఆకృతుల్లో వినాయక ప్రతిమల తయారీకి ఆర్డర్‌లు ఇచ్చేవారు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదని కుమ్మరులు వాపోతున్నారు. పెద్దబొమ్మలు ఆర్డర్‌లు చాలా వరకు తగ్గాయని, ఆ భయంతో గతంతో పోలిస్తే తక్కువ సంఖ్యలోనే బొమ్మలను తయారు చేస్తున్నట్టు తయారీదారులు తెలిపారు.

సాలూరు, పాచిపెంట పండగల ఎఫెక్ట్

ప్రతి ఏడాది వినాయక ఉత్సవాన్ని చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఐక్యంగా స్థాయి కొద్దీ మండపాలు ఏర్పాటు చేసుకుని ఘనంగా పూజలు, అన్న సమారాధనలు, అనుపోత్సవం చేస్తుంటారు. ఈ ఏడాది సాలూరు, పాచిపెంట గ్రామదేవతల పండగలు జరగడంతో ప్రజల వద్ద చాలా వరకు డబ్బుల్లేవని దీనితో ఈ ఏడాది వినాయక ప్రతిమల ఆర్డర్‌లు తగ్గాయని కుమ్మరులు చెబుతున్నారు. వినాయకుడిని పెట్టిన తరువాత అన్న సమారాధన, అనుపోత్సవాలకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల వద్ద డబ్బులు లేకపోవడంతో నిర్వాహకులు కొంత వెనుకంజ వేస్తున్నారని వారు పేర్కొంటున్నారు.

పెరిగిన తయారీ ఖర్చు

బొబ్బిలి నుంచి తీసుకువచ్చే ట్రాక్టర్ మట్టికి కుమ్మరులు సుమారు 3500 రుపాయిలు చెల్లిస్తున్నారు. తయారీలో భాగంగా ముడి సరుకులు, రంగులకు అధిక డబ్బులు ఖర్చవుతున్నాయి. ఇంత డబ్బులతో తయారు చేస్తున్న వినాయక విగ్రహాలు కొనుగోలు జరగకపోతే ఇబ్బందులు పడతామని కావున గతంతో పోలిస్తే తక్కువ సంఖ్యలోనే ఈ ఏడాది వినాయక విగ్రహాలు తయారీచేస్తున్నామని కుమ్మరులు చెబుతున్నారు. రూ.లక్షలు పెట్టి తీసుకువచ్చిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన పెద్ద విగ్రహాలకు ఇంకా ఆర్డర్లు రాకపోవడంతో ఆందోళన నెలకొందని తయారీదారులు వాపోతున్నారు.

పంటల్లేవు.. పథకాల్లేవు..

ప్రజలకు గత ప్రభుత్వంలో ప్రతి నెలా ఏదో ఒక పథకం కింద డబ్బులు వారి ఖాతాల్లో జమవ్వడంతో ఆ డబ్బులు వారికి ఇటువంటి పండగలు, ప్రత్యేక కార్యక్రమాలకు ఉపయోగపడేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పథకాలు లేక ప్రజల వద్ద డబ్బులు కొరత నెలకొందని చర్చించుకుంటున్నారు. మరోవైపు పంటల పరిస్థితులు కూడా అనుకున్నంత సానుకూలంగా ఏమీ లేకపోవడంతో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితుల్లో పండగ వైపు పెద్దగా దృష్టి సారించడం లేదు.

కుమ్మరి చక్రం కదలనంటున్నా....

కుమ్మరి వృత్తి తమ పూర్వీకుల నుంచి వస్తున్న సాంప్రదాయమని వారు చెబుతున్నారు. ఒకప్పుడు ఈ వృత్తి తమ కడుపు నింపేదని, నేడు ఆ పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి పాత్రల వినియోగం తగ్గిపోవడంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని చెబుతున్నారు. ఒకప్పుడు ఈ వృత్తే జీవనాధారంగా ఉండేదని, ప్రస్తుతం ఏడాదిలో రెండు నెలలు మాత్రమే ఈ వృత్తి కడుపు నింపుతోందని వారు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా కుమ్మరి చక్రం కదలనంటున్నా.. తమ కుల వృత్తిని వదులుకోలేకపోతున్నామని, ప్రభుత్వం తమకు చేదోడువాదోడుగా నిలవాలని వారు కోరుతున్నారు.


వినాయక విగ్రహాల తయారీలో వృత్తిదారులు

రెండు ద్విచక్ర వాహనాల దగ్ధం


టీకే రాజపురంలో దగ్ధమైన ద్విచక్ర వాహనాలు

పాలకొండ రూరల్: మండలంలోని టీకే రాజపురం గ్రామస్తులు శుక్రవారం పాలకొండ పోలీసులను ఆశ్రయించారు. తమ గ్రామానికి చెందిన జాడ దుర్గారావు అలియాస్ చిన్న అనే వ్యక్తి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని వాపోయారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పెద్దింటి సూరిబాబుకు చెందిన ఎక్సెల్ వాహనంతో పాటు దోర భానుప్రసాద్‌కు చెందిన డీలక్స్ ద్విచక్ర వాహనం దగ్ధం చేశాడని ఎస్ఐ కె.ప్రయోగమూర్తి వద్ద వాపోయారు. గ్రామస్తుల ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని అదుపులోకి తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

భవనం పైనుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతుడు గురజాపు అప్పారావు

మెంటాడ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనం పిట్టగోడ నిర్మాణంలో పని చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్రంగా గాయపడి అనంతరం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ కె.సీతారాం శనివారం అందించిన వివరాలు.. మెంటాడ మండల కేంద్రంలో నిర్మితమవుతున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణం జరుగుతుంది. దానికి సంబంధించి పిట్టగోడ నిర్మాణం జరిగే సమయంలో శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం అదపాకకు చెందిన గురజాపు అప్పారావు(32) ప్రమాదవశాత్తూ జారి పడి గాయపడినట్టు ఎస్ఐ తెలిపారు. చికిత్స నిమిత్తం గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని సర్వజన ఆసుపత్రికి తరలించినట్టు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


బలరాంనాయుడు(ఫైల్)

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన ఆయకట్టు సంఘం చైర్మన్ ఈదిబిల్లి బలరాంనాయుడు వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురై మూడు రోజుల కింద పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విజయనగరం ఎంఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బలరాంనాయుడు(62) మృతి చెందినట్టు పోలీసులు శనివారం తెలిపారు. మృతుడి భార్య ఈదుబిల్లి అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లారీ డ్రైవర్..

భోగాపురం: వీరాస్వామి అనే లారీ డ్రైవర్ విజయవాడ నుంచి వస్తూ సుందరపేట హైవే జంక్షన్ వద్ద యూ టర్న్ తీసుకుని భోగాపురం అన్నపూర్ణ హోటల్ సమీపంలో శనివారం లారీని కాసేపు ఆపాడు. తరువాత లారీ కింద మృతి చెంది కనిపించాడు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కుంభ జోషేష్ అనే వేరే లారీ డ్రైవర్ వీరాస్వామి మృతి చెందినట్టు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సీఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి డ్రైవర్ వీరాస్వామి గుండెపోటుతో మరణించాడా? వేరే ఏవిధంగానైన మరణించాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్ : అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం జీఆర్‌పీ పోలీసులు శనివారం గుర్తించారు. 50 సంవత్సరాల వయసు ఉండే ఈ వ్యక్తి తెలుపు రంగు కట్ బనియన్, ఖాకీ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, రైలు నుంచి జారి పడి ఉండొచ్చని భావిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రాత్రి సమయంలో జారి పడడంతో తలకు తీవ్ర గాయాలై ఉండొచ్చని జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన వారు 9490617089, 830990038, 9491813163 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య


ఉరి వేసుకొని మృతి చెందిన రామునాయుడు

దత్తిరాజేరు: మండలంలోని దాసరిపేట గోపినాధ పట్నాయక్ చెరువు గట్టుపై మెంటాడ మండలం మీసాలపేట గ్రామానికి చెందిన మహంతి రామునాయుడు(55) ఉరి వేసుకొని మృతి చెందినట్టు పెదమానాపురం ఎస్ఐ జయంతి శనివారం తెలిపారు. పొలం పనులకు వెళ్తానని ఇంటి వద్ద చెప్పి దాసరిపేట చెరువు గట్టుపై మృతి చెందడంతో బంధువుల ద్వారా సమాచారం తెలియడంతో కుటుంబంలో ఒక్కసారి విషాదం నెలకొంది. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడికి వివాహం అయిన కుమార్తెతో పాటు కుమారుడు, మరో కుమార్తె ఉన్నారు.

18 నుంచి ఆలా హజరత్ ఉత్సవాలు

విజయనగరం టౌన్: దేశ వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ ఆలా హజరత్ ఉత్సవాలను సున్నీ మసీదుల్లో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు పట్టణ శాఖ ముస్లింల ప్రతినిధి మహమ్మద్ గౌస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట, కురుపాం, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న మసీదుల్లో ఉరుసు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఆబాద్ వీధిలో ఉన్న మదరసా ఆల్ జామియాతుల్ హబీబియా అహ్మదీయా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్సవ ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రార్ధనల అనంతరం భారీ అన్న సమారాధన ఉంటుందని తెలిపారు.

స్పా సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు


స్పా సెంటర్ రికార్డులు పరిశీలిస్తున్న సీఐ చౌదరి, ఎస్ఐ సురేంద్రనాయుడు

విజయనగరం క్రైమ్: నగరంలోని ఏడు స్పా(మసాజ్) సెంటర్లలో వన్‌టౌన్ పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మసాజ్ సర్వీసుకు వచ్చే స్త్రీ, పురుషులను వేర్వేరుగా ఉంచాలని సీఐ ఆర్వీకే చౌదరి నిర్వాహకులకు సూచించారు. డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సీఐ చౌదరి, ఎస్ఐలు రామ్‌గణేష్, లక్ష్మీప్రసన్నకుమార్, సురేంద్రనాయుడులు మసాజ్ కేంద్రాలకు వెళ్లి, పరిశీలించారు. తప్పనిసరిగా కేంద్రంలో అర్హులైన ఫిజియోథెరపిస్టులు ఉండాలన్నారు. రాత్రి వేళల్లో స్పా సెంటర్‌లకు అనుమతి లేదని, ఎవరూ నిర్వహించవద్దన్నారు.

గురజాడ సాహిత్య సంపద, స్మారక భవనాన్ని కాపాడాలి


గురజాడ విగ్రహం వద్ద ఘన నివాళులర్పిస్తున్న పౌర వేదిక సభ్యులు

విజయనగరం గంటస్తంభం: మహాకవి గురజాడ అప్పారావు స్మారక భవనం గురించి జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలకూ, మంత్రులకూ పట్టకపోవడం శోచనీయమని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు. గురజాడ రచనలను భద్రపరచాల్సిన ఆర్కియాలజీ విభాగం, రాష్ట్ర టూరిజం శాఖ పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా గురజాడ గృహాన్ని, గురజాడ సాహిత్యాన్ని కాపాడటంలో పూర్తిగా విఫలమవుతున్నారన్నారు. గురజాడ గృహంలో గురజాడకి శనివారం ఘన నివాళులు అర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గురజాడ అప్పారావు ఇంటిలో తాగుబోతు హల్ చల్ చేసి, సాహిత్య సంపదని, వస్తువులను చిందరవందర చేసినా అధికార పార్టీకి చెందిన నాయకులు ఎవరూ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత, విజయనగరం జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లాలోని ఎమ్మెల్యేలుగాని గురజాడ ఇంటిని సందర్శించడానికి కూడా తీరిక కల్పించుకోలేని పరిస్థితిలో ఉండడం పట్ల ఆయన మండిపడ్డారు. తెలుగు సాహిత్యాన్ని ప్రపంచం నలుమూలలకి పంపి సుసంపన్నం చేసిన గొప్ప వ్యక్తికి మన నేతలు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గురజాడ అప్పారావు సాహిత్య సంపదకు, గురజాడ స్మారక భవనానికి తగిన రక్షణ కల్పించాలని భీశెట్టి కోరారు. పౌర వేదిక కార్యనిర్వాహక అధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, సహాయ కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కనకాంబరాలతో కనక వర్షం


కనకాంబరాల తోట

- సాగుపై పెరుగుతున్న ఆసక్తి

భామిని: పూల సాగులో కనకాంబరాలది ఓ ప్రత్యేకత. గ్రామీణ ప్రాంతాల్లో వాడంబారాలుగా పిలవబడే వీటిని కనకాంబరాలగానే పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తారు. ఏడాది పొడవునా పూలు పూస్తూ సాగుదారులకు మంచి ఆదాయాన్ని తెచ్చి పెడతాయి. వీటిని ఒకసారి నాటితే మూడేళ్ల వరకు దిగుబడినిచ్చి సాగుదారులకు పుష్కలంగా ఆదాయాన్ని అందిస్తాయి. ఈ పూలు వాసన లేకున్నా వివిధ రంగుల్లో మహిళలను ఆకర్షిస్తాయి. అదే సమయంలో వివిధ శుభకార్యాల్లో వీటికున్న ప్రత్యేకత వేరు. వీటిని స్త్రీల శిరోజాల అలంకరణతో పాటు శుభ కార్యాల్లో వేర్వేరు రూపాల్లో అలంకరించి ఆదాయాన్ని పొందుతారు. ఇవి ఎక్కువగా ఆరంజ్, ఎల్లో, ఎరుపు రంగుల్లో పూస్తాయి. మార్కెట్‌లో ఈ రకాలకు మంచి డిమాండ్ ఉండడంతో పాటు గిట్టుబాటు ధరలు వస్తుండడంతో రైతులు వీటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. కొబ్బరి, మామిడి తోటల్లో అంతర పంటలుగా కూడా వీటిని సాగు చేయవచ్చని చెబుతున్నారు. పాలకొండ నియోజకవర్గంలో భామిని, వీరఘట్టం, పాలకొండ మండలాల్లో వీటి సాగు ఎక్కువగా ఉంది. స్థానికంగా వీటిని విక్రయించడంతో పాటు దూర ప్రాంతాలకు ఎగుమతి కూడా చేస్తున్నారు. పాతపట్నం, టెక్కలి, ఒడిశాలోని పర్లాకిమిడి, గుణుపూర్ ప్రాంతాలకు రోజూ రవాణా చేస్తున్నారు. మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

ఈ సీజన్‌లోనే...

ప్రస్తుతం కనకాంబరాలు నాటుకొనే సమయంగా రైతులు చెబుతున్నారు. ఏటా జూలై – ఆగస్టు నెలల్లో కొత్తగా తోటలు నాటుకుంటారు. రెండు నెలలుగా నారు పోసి సంరక్షించుకుని ఆ నారును మెట్టు భూముల్లో వేస్తారు. నాణ్యమైన నారు కోసం రామభద్రపురం, సాలూరు, రాజమండ్రి నర్సరీల నుంచి దీన్ని తెస్తున్నారు. అధిక తేమ, వేడి కలిగిన నేలల్లో సాగుకు ఇది అనుకూలం. చల్లని వాతావరణ పరిస్థితుల్లో అధిక దిగుబడినిస్తాయి. నీరు నిలువ లేని అన్ని రకాల నేలలు వీటి సాగుకు అనుకూలం.

విత్తన తయారీ..

విత్తనం, కాండపు మొక్కల ద్వారా ప్రవర్ధనం చేసుకోవచ్చు. అధిక దిగుబడినిచ్చే రకాలను విత్తనాల ద్వారా తయారు చేస్తారు. ఎకరానికి రెండు కిలోల విత్తనం అవసరం. నిల్వ చేసిన విత్తనం మొలకెత్తే శాతం తక్కువ. అప్పుడే పూల గుత్తిల నుంచి వేరు చేసిన విత్తనాలను సిద్ధం చేసుకోవచ్చు. ఒక మీటరు పొడవు, 15 సెంటీమీటర్ల ఎత్తు గల నారుమడులు సిద్ధం చేసి నారు వేసుకోవాలి. మొక్కలు 4 నుంచి 6 ఆకులు వేసిన 50 నుంచి 60 రోజుల్లో నారును తీసి నాటుకోవచ్చు. నీటి ఎద్దడిని తట్టుకొంటుంది. అయినా అవసరాన్ని బట్టి 10 నుంచి 15 రోజులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వారానికి ఒకసారి అందించాలి. డ్రిప్ పద్ధతిలో అయితే 4 లేదా 5 రోజులకు ఒకసారి నీరు పెట్టాలి.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



మొక్కలు పెరిగే దశలో కలుపు లేకుండా చూడాలి. వేసవిలో ఎండ తీవ్రతను తగ్గించడానికి అవిసె మొక్కలు పెంచితే పాక్షిక నీడ ఏర్పడి మొక్కలు బాగా పెరిగి అధిక పూల దిగుబడి వస్తుంది. పూలు కోసిన తరువాత పూల గుత్తిలను, ఎండు కొమ్మలను తొలగిస్తే ఏడాది పొడవునా పూల దిగుబడి పెరుగుతుంది. మొక్కలు నాటిన రెండు లేక మూడు నెలలకు పూత వస్తుంది. జూన్ నుంచి జనవరి వరకు పూత బాగా ఉంటుంది. వర్షాకాలంలో దిగుబడి తగ్గుతుంది. రెండు రోజులకు పూలు విచ్చుకొంటాయి. ఉదయం లేదా సాయంకాలం మాత్రమే పూలు కోయాలి.

– కొల్లి తిలక్, వ్యవసాయాధికారి, భామిని

కన్యాశుల్కం ప్రదర్శన పూర్వజన్మ సుకృతం


దర్శకులు ఈపు విజయకుమార్‌తో ప్రశంసపత్రాలు అందుకున్న కన్యాశుల్కం మహిళల బృందం

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ కలం నుంచి జాలువారిన కన్యాశుల్కం నాటకాన్ని 60 ఏళ్లకు పైబడిన మహిళలతో రవీంద్రభారతిలో ప్రదర్శించడం పూర్వజన్మ సుకృతమని దర్శకులు ఈపు విజయకుమార్ పేర్కొన్నారు. మహాకవి స్వగృహంలో శనివారం సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయసూర్య ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కన్యాశుల్కంలోని బొంకులదిబ్బ సీన్, మధురవాణి ఇల్లు–మంచం సీన్, అగ్నిహోత్రవధాన్లు ఇళ్లు – తాంబూలాల సీన్, సౌజన్యరావు పంతుల ఇళ్ల (డామిట్ కథ అడ్డం తిరిగింది సీన్)ను కేవలం వయోవృద్ధులైన మహిళలతో విజయవంతంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ నెల 12న రవీంద్రభారతిలో అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్–2025లో కన్యాశుల్కం ప్రదర్శించి ఆహుతుల మన్ననలు పొందామన్నారు. గాంధీ జ్ఞానప్రతిష్టాన్ చైర్మన్ డాక్టర్ గున్నా రాజేంద్ర రెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ బి.సత్యానందం, సినీన టి, సంఘసేవకురాల కరాటే కల్యాణి, అభినయ శ్రీనివాస్ తదితరుల చేతుల మీదుగా ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నామన్నారు. భోగరాజు సూర్యలక్ష్మి నిర్వహణ బాధ్యతలతో పాటూ గిరీశం పాత్రధారిలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చి ఆహుతుల మన్ననలు పొందారన్నారు. వీరితో పాటూ మధురవాణిగా ఎ.సీతామహాలక్ష్మి, కరటకశాస్త్రిగా ముళ్లపూడి సుభద్రాదేవీ, అగ్నిహోత్రవధానులుగా కుమారి సామవేదుల గీతారాణి, వెంకటమ్మగా ఉదయగిరి నీలిమ, రామప్పపంతులుగా సిహెచ్.రాజకుమారి, బుచ్చమ్మగా పూటకూళ్లమ్మ, పోటోగ్రఫీ పంతులు నౌకరుగా సామవేదుల సత్యలత, సౌజన్యరావు పంతులుగా చీకటి చంద్రికారాణిలు పాత్రోచితమైన ప్రదర్శన చేసి ఆహుతుల కరతాళ ధ్వనులందుకున్నారని తెలిపారు. శ్రీకాకుళానికి చెందిన ఎస్.రమణ రంగాలంకరణ, రూపాలంకరణ చేశారన్నారు. ఈ సందర్భంగా కన్యాశుల్కం నాటక ప్రదర్శనకు తోడ్పాటునందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భోగరాజు సూర్యలక్ష్మి, సుభద్రాదేవీ, కన్యాశుల్కం టీమ్ సభ్యులు పాల్గొన్నారు.